ఎక్సురేలాల.

# శాస్త్రి

"విహారి"

పూర్వకాలం మన భారతదేశంలోని చదువులు ఐహిక సాదనకీ, అముష్మిక సాధనకీ ఉపకరిస్తూ ఉండేవిట. ఇది సర్వసామాన్యంగా అనుకునేమాట. కాని అనాటివారు అప్రత్యక్షమైన అముష్మికంకోసం చర్మచక్షువులకి ఎదట ప్రత్యక్షంగా కనపడే ఐహికాన్ని తృణకణాయమానంగా చూచేందుకు తగిన విద్యకే ప్రాధాన్యంయిస్తూ వచ్చారని పురాణాలూ, చరిత్రలూ పరిశీలిస్తే తోస్తుంది దానిఫలం ఎలా పరిణమించిందీ, జనాన్ని ఎలా తయారు చేసిందీ ఆచరిత్రలే చెబుతున్నాయి. అప్రాచ్యశ్వేత జాతివారు యీదేశానికివచ్చిన తర్వాతనే దేశం అచాదస్తనుంచి కాస్త తెప్పరిల్లింది, అప్రత్యక్షానికి స్వస్తిచెప్పి ప్రత్యక్షమైన ఐహికానికి ప్రాధాన్యం ఇచ్చింది. అంతతో నిలబడక, ఐహికంలోనూ కేవలం స్వోదరపోషణే జీవిత పరమావధిగా సారాంశం కింద తేల్చివేసింది, అది యేమార్గంలోనైనా ఉండనీ, తనకు కాని ధర్మముందా! మనల్ని ఇంత ఉన్నతి పధానికితెచ్చి విడిచిన అప్రాచ్యజాతుల ఋణం మనం యేనాటికైనా తీర్చుకోగలమో లేదో!

వేయింటికి తొమ్మిదివందల తొంబైతొమ్మిదిన్నర మాదిరిగానే, కొండన్నకూడా ఏదో ఉద్యోగం సంపాయించుకొని బతకాలనే ఉద్దేశ్యంతో బళ్ళో పాదంపెట్టాడు. ఏ. బి తో ప్రారంభించిన చదువు బి. ఏ తో పూర్తిచేశాడు. అతడు ఇన్నాళ్ళనుంచిచేసిన తపస్సుకు ఫలితంగా ఉదరదేవి ప్రత్యక్షమైంది. "వత్సా నీ పట్టుదలకు సంతోషించాను నన్ను మించిన దైవంలేడని నీవు గ్రహించినందుకు నిన్ను కడతేర్చడానికి నేను సిద్ధంగా ఉన్నాను. వరంకోరుకో" అన్నది. కొండన్న శాస్త్రీయంగా ఆదేవతకు నిగిడి ఒక్కశల్యూటుకొట్టాడు. "దేవీ ఇంతదానివి నీవే ప్రత్యక్షమయ్యావట నా జన్మతరించింది. ఇహ నాకు ఏంకోరిక ఉంటుంది? 'నీ పాదకమల సేవయు. నీ పాదార్చకులతోటి నెయ్యమును నితాం, తాపార—" పూర్తికాలేదు. ఉదరదేవి. "వత్సా, అస్మత్పరమ భక్తాగ్రేసరా, అట్లేయగుగాక. నేడీదేశమున దరిదాపుగనందరునూ కోరుచున్న తారణోపాయమునే కోరుకొంటివి. సాధు! జీవితాంత పర్యంతమును నా సేవలో లేశమాత్రమును లోపము రాకుండజరిపి. అనంతరము నాసారూప్యమును పొందుము" అని శెలవిచ్చి అతనిలో లీనమైపోయింది.

కొండన్న కళ్ళు నులుపుకున్నాడు. వేంరనేవెళ్లి రెండు డజన్ల అప్లికేషన్లు టైపుకొట్టించి, దశదిశలకు విరజిమ్మాడు. ఇన్ని రాళ్ళువేస్తే వొక రాతికైనా పండురాలదా! లక్ సరిగా ఉండివీటిలో నాలుగైదింటికే అర్డర్లువొస్తే, ఉన్నవాట్లో మంచిదాన్ని సెలెక్టు చేసుకుంటాను. మిగిలినవి బుట్ట దాఖలా! అనుకున్నాడు కొండన్న.

క్రమంగా వారం, పదీ, పదిహేనూ, నెల రోజులూ గడిచాయి. తపాలాఫీసుకూ ఇంటికీ రోడ్డుపడ్డది. నాకేమైనా వొచ్చిందటోయ్ అని అతిగా అడగడంవల్ల తపాల జవాను చీదరించుకొని "ఇంత చదువుకున్నారే, యేదైనావొస్తే యివ్వనటండి, ఎందుకు యింతగా సతాయించడం?" అని గర్దించిన విధంగా మాట్లాడ్డంకూడా జరిగింది. అప్లికేషన్లతో నౌకర్లూ, ఆశీర్వచనాలతో పిల్లలూ లభించడం అసంభవమని అతగాడు తేల్చుకునేసరికి రెండోనెలకూడా నిండింది. అతని అక్రోశానికి అంతం ఇంతా అనిలేదు. ఐతే ఏం చెయ్యాలి? పేదవాడికోపం పెదవికేచేటు. అతడు మనసు క్రమంగా స్వస్తపరుచుకొని తదనంతర కార్యక్రమానికి ఆలోచించడం మొదలుపెట్టెసరికి ముచ్చటగా మూడో నెల కూడా గడిచింది.

అబ్బాయి కొండన్న ఆలోచనలో పడ్డాడు. కుక్కిమంచమూ, ఆకాశమూ, రాత్రిపూట నక్షత్రాలూ అతని ఆలోచనకు ఎంతో అవకాశాన్నీ విశ్రాంతినీ? యిచ్చాయి కాని డఫేదారు హోదాలో ఉండి, వేలార్జించి ఉపకారవేతనం పొందుతూన్న అతని తండ్రి మాత్రం అతణ్ని ఆహారనిద్రలనుండి దూరంచేశారు. ఒకటేపోరు, ఒకటే పోటుకు! విద్యతోపాటు అలవరుచుకున్న ఆత్మాభిమాన విహీనత అనే వజ్రకవచం ఒకటి ఉండబట్టి సరిపోయింది కాని అదే లేకుంటే ఏనాడో అతను బావో, చెరువో చూచుకొని ఉండేవాడు.

కొండన్న ఒకనాటి సాయంకాలం కుక్కి మంచం మీద వెల్లకిల పండుకొని ఆలోచిస్తున్నాడు. పక్కయింటి ముసలాయన మనమణ్ని ఛాతీమీద పండబెట్టుకొని రోజుకు మల్లే పద్యాల్ని పలికిస్తున్నాడు. అందులో "ఇరుసున కందెనబెటక. పరమేశ్వరు బండియైన పారదు సుమతీ" అన్న

ముక్క కొండన్నను ఆకర్షించింది. అతనిలో ఓ నూతన ప్రకాశాన్ని కలిగించింది. చటమని లేచికూచున్నాడు. పాఠ్యపుస్తకాల ఫ్యాషనుకు పనికిరాని యీపాత పద్యం లోని ముక్క ఇంతపని చేస్తుందని అతడు ఎన్నడూ అనుకో లేదు. పాఠ్యపుస్తకాలలోకి పసందు చెయ్యకుంటె చెయ్యకున్నారు కాని, వీటిని ఉచ్చరించడం కూడా నిషేధంగా బొగాచేయనందుకు కొండన్న సర్కారును మనసులో అభినందించాడు. ఆ పద్యాలు వాసిన దౌర్భాగ్యుడు యీనాడు బతికుంది క్రమంగా ప్రైజుచేశుంటె, యిది పార్యగ్రంథాల్లో కివచ్చేశే ఉండేదేమో అనికూడా అతడు సమర్థించుకున్నాడు.

కొండన్న స్వయంగా ఈతూరి బయలుదేరాడు తండ్రికి తెలీకుండా పక్క స్నేహితునిదగ్గర టూ హండ్రెడ్సు ఐదులు పుచ్చుకొని, వారంరోజుల్లో ఆర్డరు చేత్తోపుచ్చుకొని మరీ వొచ్చేశాడు.

ఒక పక్షంగా మనసులో సంతోషించినా, "ఇంత చదువుచదివి చివరకి పారెస్టరేనట్రా" అని పైకి ఎత్తిపొడిచాడు పితృదేవుడు. ఎలాగైతేనేం నౌకరీ దొరికింది. అడవిలో నివసించడానికి తగిన సరంజామాతో బయలుదేరాడు పారెస్టర్ కొండన్న. ఇహ ఉద్యోగనిర్వహణాన్ని గురించి చూడాలి.

మనుష్యుల్లో అవస్థాభేదాన్నిబట్టి మనస్తత్వం ఎలా మారుతుంటుందో, ఉద్యోగం, లేక నౌకరీ జీవిత ప్రమాణం లోని అవస్థాభేదాన్ని పట్టికూడా ఆయావ్యక్తులయొక్క మనస్తత్వాలు భిన్నభిన్నంగా ఉండి మారుతుంటాయి. నౌకరీలో చేరిన కొత్తల్లో ఉద్యోగధర్మం తూ, చా తప్పకుండా నిర్వహించాలనీ, శరీరాన్ని ఏమాత్రమూ దాచుకోకూడదనీ, జీవితంలో ఎలాంటి కళంకమూ ఉండకూడదనీ, అన్నీ ఆదర్శప్రాయంగా ఉండాలనీ పట్టుదల ఉంటుంది. ఇది ఉడుకు రక్తపు లక్షణం. కాని కాలం గడిచేకొద్దీ, రక్తంలో వేడి తగ్గేకొద్దీ, అనుభవం అయ్యేకొద్దీ, వెంట పనిచేస్తూండే ఘనముఖులను చూచేకొద్దీ, నైతిక పటుత్వం తగ్గుతూ వొస్తుంది "ఏమిటో లే!" అనిపిస్తుంది. చరమావస్థలో అన్నిటికీకూడా చరమావస్థ వొచ్చేస్తుందని వేరే చెప్పవలసిన పని ఉండదు. ఇది సర్వసామాన్యులను గురించినమాట. దీనికి అతీతులైన మహామహులున్నారు ఈనాడు అక్కడక్కడ. వీరు ఉద్రేకానికి లోనుకారు. వీరిరక్తం టెంపరేచరు ఉద్యోగంలో చేరిననాడు ఎన్ని డిగ్రీల్లో ఉంటుందో, విరమించు కునే రోజుకూడా అన్ని డిగ్రీల్లోనే ఉంటుంది. వీరికి కొత్తదనమూ, లేనిపోని భేషజమూ అంటూ ఉండదు. వీరు పుట్టుకతోనే సర్వసద్గుణ సంపన్నులుగా ఉదయిస్తారు.

కొండన్న అంతటి మహామహుల తెగలోచేరడు. అంచేత అందరికి మల్లే ఆదిలో తాత్కాలికో ద్రేకానికి లోపడ్డాడు. ప్రతిదినమూ చీకటితో లేవడమూ, స్నానాది నిత్యకృత్యాలు ముగించుకొని నడుమున కత్తి, బుజంమీద తుపాకీ చేతులో భోజనసామగ్రీ ధరించి అడివిలోకి బయలుదేరడమూ, నిర్ణీత ప్రదేశాల్ని పగలంతా గాలించి సూర్యాస్తమయానికి స్వస్థానం చేరుకోవడమూ, దినచర్యవ్రాసి తిండితిని నిద్రించడమూ, అతనికి నిత్యకృత్యం రామనామం ఐపోయింది.

ఈవిధంగా ఆరునెలలు గడిచాయి. అడవి అంతా కొండన్న అంటే హడలెత్తిపోయింది. అంత అడవిలోనూ ఒక పలుదోము పుల్లకూడా అన్యాక్రాంతం అయ్యేది కాదు. ఒక్కొరోజు అతను విరాత్రి కాలంల్లోనే తుపాకితో సహా చీకటిని చీల్చుకుంటూ అడవిలోకి వెళుతుంటేనూ. అందరూ వేకువనేలేచి ఉచితంగా లభించిన దూలాలతో చలిమంట వేసుకుంటున్నంటె అడివిలోంచి రాక్షసుళ్ళాగా మంచుకారుకుంటూ తుపాకీతోనూ వొస్తూంటెనూ, అతణ్ని చూచి సహెూద్యోగులు కేరింతలు కొడుతుండేవారు. ఒకనాడు, "ఏమంత ప్రాణంమీదికి వొచ్చింది మిస్టర్. నౌకరీకోసం ప్రాణాల్ని వొదులావా? వెధవ ఉద్యోగమే జీవిత పరమార్థమా ఏమిటి? ఇంత అడివిలో ఏమూలనో ఓబందెడు కట్టెలో, రెండు దంతెకొయ్యలో ఎలాగూ పోతూనేవుంటాయి. వాటంతట అవి దొరుకుతే సరే కాని, యిలా కంట్లో వొత్తివేసుకొని చస్తారుటయ్యా! బాగానేవు ది! ఇంత యేడిచినా మా డైరీలమాదిరీగా నీడైరీ ఏనాడైనా ఆఫీసరుకు నచ్చి చచ్చిందా? నాలుగు నెల్లనుంచి ఒకకేసైనా పట్టలేదు, నిన్ను నౌకరీలోనుంచి ఎందుకు తీసివేయకూడదూ అంటూ రాత్రి టపాల్లో శ్రీముఖంకూడా వొచ్చింది" అంటూ మందలించారు.

అన్నంతా ఐంది. ఆఫీసరు పిలిపించి "జవాబు ఏం చెబుతావు" అన్నాడు. ఏముంది చెప్పడానికి?" తాము చూస్తూనేవున్నారు. నేనేం శరీరాన్ని దాచుకోవడం లేదు. అరణ్యం అంతా హిరణ్యకశిపుని లాగా అంగుళం అంగుళం గాలిస్తున్నాను. నాకు తెలీకుండా పిట్టకూడా నా బౌండర్లోకిరాదు. అలాంటప్పుడు కేసు ఎలా దొరుకుతుంది? నన్నే దారిన వెళ్ళేవాణ్నైనా పట్టుకొని రమ్మంటారా?" మీరే శెలవియ్యండి" అని మనవి చేసుకున్నాడు కొండన్న. ఆఫీసరు ఒప్పుకోలేదు. "నీలాంటివారిని చాలా మందిని చూచాను. నా దగ్గర నీ వాదాలు పనికిరావు. ఇలా ఇకానబార్డినేషణగా మాట్లాడినందుకు ఈతూరి క్షమించాను." అని గదిమాడు ఆఫీసరు.

కొండన్న బదులు చెప్పలేదు. తిన్నగా గదికివెళ్లాడు. రాత్రంతా నిష్కారణంగా తనమీదికివచ్చిన ఆపదనుగూర్చి ఆలోచిస్తూ వేగించాడు. తెల్లవారేసరికి అతనికి జ్వరం వొచ్చేసింది. ఆ జ్వరంతో రెండురోజులు తగని బాధపడ్డాడు. కాని శెలవుమాత్రం పెట్టలేదు. జ్వరం విడిచినప్పుడు మూడు నాలుగుమైళ్ళు అరణ్యంలోకి వెళ్లివస్తూనే ఉన్నాడు.

మూడవరోజు జ్వరంరాలేదు. ఆరోగ్యంగా ఉన్నా నీరసంగా ఉండిపోయింది. రాత్రి పథ్యం ముగించుకొని పండుకున్నాడు. కాని నిద్రపట్టలేదు. అప్పుడే ఆఫీసు గడియారం పన్నెండు కొట్టింది. "నీరసంవల్ల నిద్రరావడంలేదు. ఊరికే ఎందుకుండాలి అలావెళ్లి కాస్తదూరం తిరిగివద్దాం" అనుకున్నాడు కొండన్న. ఎందుకైనా మంచిదేనని తుపాకిమాత్రం తీసుకొని మెల్లిగా బయలుదేరాడు.

పిండి ఆరబోసినట్టు వెన్నెల కాస్తూంది తెరపలు తెరపలుగా చెట్లసందుల్లోంచి పడుతూన్న వెన్నెల వెలుతుర్లో, చిరపరిచితమైన ఆరణ్యమార్గాన నాలుగుమైళ్ళదూరం వెళ్ళాడు. ఒక గుట్టమీదికెక్కి నాలుదిక్కుల అలకించాడు కొండన్న. ఆశ్చర్యం అర్థరాత్రిదైన అరణ్యాని స్తబ్ధతను చీల్చుకుంటూ దూరంగా ఎక్కడో బండ్లు నడుస్తూన్న శబ్ధం చిటుకు, చిటుకుమంటూ కర్ణరంధ్రాల్లో ప్రవేశించింది. అతడు నిమిషంలో ఇది ఇంతదూరంలో, ఫలానా మార్గంలోని శబ్దమే అని గమనించాడు. మొహం జేవురించింది. బండ్లను అడ్డం తగలడానికి వీలైన దగ్గరి కాలిమార్గంగా తూనీగలాగా బయలుదేరాడు గంటలో బండ్లదారి చేరుకున్నాడు బండ్లింకా అక్కడికి చేరుకోలేదు. అంచాత అక్కడ ఉన్న ఒక చెట్టుమీదకూచుని తుపాకిని భద్రపరుచుకున్నాడు. పది నిమిషాల్లో బండ్లువొచ్చి చేరాయి. దొంగ కలప సామానుతో నిండిన బండ్లుపూర్తిగా ఆరున్నాయి.

కొండన్న తుపాకిని ముందుకుచాచి లేచి నిలబడ్డాడు "ఏయ్! ఎవరి వాబండ్లు. నిలబెట్టు?' అని గర్జించాడు. బండ్లు నిలబడ్డాయి. కంఠశబ్దమూ, అవాలకమూ బండివాళ్ళ కర్థమైపోయింది. కొండన్న జబ్బుగా ఉన్నాడని వాళ్ళు వినే యిలా తెగింపగలిగారు కాని, ఈవిధంగా మేఘంలేని పిడుగు పడుతుందని వాళ్ళనుకోలేదు. పై ప్రాణాలు పైన్నే ఎగిరిపొయ్యాయి సారధులుతప్ప సొంతదారూ, సహాయకులూ ఒక్క రొక్కరుగా కొండన్న చుట్టూవచ్చి చేరారు, దండాలు పెట్టారు.

యజమాన్ని చూపులోనే గుర్తించాడు కొండన్న. "ఏమండీ. ఏం పనిచేశారు; బండ్లను ఆఫీను దగ్గరకి తోలించండి" అన్నాడు తామూలుగా.

"దాం దేం బాబూ అట్లాగే తోలిస్తాం. కాని నా మనవి కొంచం వినండి. యేదో బీదముండా వాళ్ళు కొంపలు కాలీ చస్తుంటే సహాయం చేద్దామని ఈపనిచేశాను. వాళ్ళమీద మీరుకూడా కనికరించాలి క్షమించి యీసారికి పోనియ్యండి. ఇంకోసారి తప్పు జరగదు."

"ఇది మీ సొమ్ముకాదు. మాదీకాదు క్షమించడానికి. ఇలాంటి మాటలతో ఫాయిదాలేదు బళ్ళుతిప్పండి."

"మీరట్లా శెలవియ్యొద్దు. ఏదో జరిగిపోయింది. ఇంత మాత్రంతో తమకురాగల ప్రమాదంలేదు. ఈసారికి పోనియ్యండి ఇంకోసారి మేం కనపడితే, మీ చిత్తంవచ్చినట్టు చెయ్యొచ్చు"

"అపప్పంతా ఉడకదు. చక్కగా బండ్లను ఆఫీసు వేపు పట్టించాలి. తెలిసిందా!"

"ఐతే బాబూ, మీరు నాకు వేయించబొయ్యే జరిమానాకు భయపడతాననా మీ అభిప్రాయం. అట్లా వినాటికీ జరగదు. నేను గౌరవంకోసం పాకులాడుతున్నాను. ఫలానామనిషి యిట్లా దొంగపని చేశాడంటే తీరని అప్రతిష్ఠ. నాకుండె గౌరవం వాగులోకలిసి పోతుంది. తల ఎత్తుకొని తిరగడానికే వీలుండదు. పదండి. మీ యీ ఉపకారం మరిచిపోను."

"నా సంగతి మీకు బాగా తెలీనట్టుంది. కనికరం మాట వేరే, కావాలంటే ఆ బీదవాళ్ళకి పదిరూపాయలు చందా యిస్తాను తీసుకోండి అంతేగాని స్వామిద్రోహం మాత్రం నావల్లకాదు లేవండి"

"నాకు తమ సంగతి తెలియికేం. కాని పొరపాటున జరిగిన దానికి నా మర్యాదను గంగపాలు చెయ్యవద్దని వేడు కుంటున్నాను"

"మరి మాట్లాడవద్దు, బండ్లు సాగించండి, లేదా ఏదికావాలో అదే ఔతుంది"

"అంత ఎందుకులెండి, మేము ఆయాసపడి మిమ్మల్ని ఎందుకు ఆయాసపెట్టాలి? యీబళ్ళల్లో మహా ఉంటె వందరూపాయల కలప ఉంటుంది. తెల్లవారేసరికి మనో మాట మూడు పచ్చకాగితాలు పంపించు కుంటాను. అమ్మగారికి ఏదైనా ఓసొత్తు చేయించండి ఉంటుంది జ్ఞాపకార్థంగా."

కొండన్న తనలో నవ్వుకున్నాడు. కాస్త తీవ్రంగా "నేను ఆరకం మనిషిని కాదు. తెలిసిందా?"

"చిత్తం, తెలీకేం! దయగలవారు కాబట్టె కనికరించి మానం కాపాడుతారని కోరుకోవడం. ఐతే తమరు ఏం

శెలవు పెడతారో పెట్టండి."

"బండ్ళను ఆఫీసుకు తోలమనడమే నా శెలవు."

"ఐతే మొహాన మశిపూసుకొని తిరగ మంటారా రేపట్నుంచి."

"మీ యిష్టం."

"మీ నియమం కోసమని నన్ను కుక్కల పాలు చెయ్యకండి ఐదు పంపిస్తాను తృప్తిపడండి."

"వీలు కాదు"

"పోనీండి ఆఖరుమాట ఒక్క సంచి"

"మీరింకా తప్పుమార్గంలోనే ఉన్నారు. లాభంలేదు.",

"ఇంత మందిలో మీపాదాలు పట్టమన్నా పడతాను నన్ను మాత్రం రచ్చకు యీడవ్వొద్దు ఇంతకుపైన నావల్ల కాదు. మానంకోసం రెండువేలకు సిద్ధం!"

కొండన్న కళ్ళుమెరిసి పొయ్యాయి హృదయం కంపించింది. ఒక్కసారిగా రెండువేలు! ఇంత మొత్తం ఎన్నాళ్ళుదేకితే సంపాదించాలి? ఇలాంటి బండ్ళు యేమూల నుంచో, ఎన్నో పోతూనే వుంటాయి ఈ అడివికి నేనేం ధర్మకర్తనా! ఇక్కణ్నుంచి తన్నితే రేపు ఎక్కణ్నో పడతా! దీనిగతి ఏమైపోతే నాకేం కాబడుతుంది? వెధవచాకిరీ, సలాములూ, ఇవన్నీ యీ పైసాకోసమే కదా! ఏమిచేసినా రెండో కంటివాడికి తెలీదు, ఈ సంగతులన్నీ అతని మనసులో క్షణకాలంలో తిరిగాయి దయ, లక్ష్మి ఎదురుగా నిలబడి! ఇహమూ, పరమూకూడా ఇందులో ఉంది. చేజిక్కింది జారవిడిచేవు సుమా!" అని హెచ్చరిస్తున్నాయి.

ఊఁ, హూఁ. ఎంతైనా కొండన్న బింకం తగ్గలేదు. రక్తంలో శీతల కిరణ ప్రసారంకాలేదు. కొత్తలో సాధారణంగా ఉద్యోగంచేసేవారిలో ఉండె "నిష్ఠ" అని వాడబడే దౌర్బల్యం అతనికి బాగా ఒంటపట్టింది. తుపాకి తీసుకొని బండ్ళవేపు బయలుదేరాడు "మీరు నూరు చెప్పండి, వెై చెప్పండి. వినను" అంటూ.

'చివరకు మూటివల్లకూడా పని చక్కపడ దంటారా?" అంటూ బండ్ల యజమాని అతణ్ని అనుసరించాడు సహాయకులు వెంటనడిచారు. కొండన్న మరి మాటాళ్ళేదు ముందు బండినగలను పట్టుకొని, పక్కదారివేపు తిప్పే ప్రయత్నంలో ఉన్నాడు అకస్మాత్తుగా అతని తలపై వెనకవేపునుండి గొడ్డలి దెబ్బపడిపోయింది. దెబ్బ జారడంవల్ల చెవిలో సగం చీల్చుకొని పోయింది; పక్క తలపై బలమైన గాయం కలిగింది. కొండన్న తుపాకితో సహా నరకబడ్డ చెట్టులాగా కూలిపొయ్యాడు

కొండన్న అస్పత్రికి చేర్చబడి రెండు వారాలైంది. కొద్ది కొద్దిగా కోలుకుంటున్నాడు. అతను ఏదో చెప్పనేమో చెబుతున్నాడు కాని, ఆ కొట్టినవాడు పలానావాడని ఒక్క పిట్టకూడా సాక్ష్యం చెప్పడంలేదు పదహారోరోజు కొండన్నకి శుభలేఖ అందింది. "నీవు ఉద్యోగధర్మం సక్రమంగా నిర్వహించడంలేదు. నాలుగైదు మాసాలుగా ఒక్కకేసు కూడా పట్టలేక పొయ్యావు దానికి నీవు చెప్పుతున్న సమాధానం తృప్తికరమైనది కాదు. కాబట్టి నీ సర్వీసు మాకవసరంలేదు" అంటూ.

కొండన్నను ఏ ఆదర్శమూ అడ్డుకోలేదు. ప్రవాహానికి ఎదురీదాడు; శుక్రవారం పూట లక్ష్మిని తన్నేశాడు, మిత్రవాక్యాన్ని పెడచెవిని పెట్టాడు, దానికి శాస్తి ఐంది.


## బాలసుధ

ఇది మలయాళమూలికలచే తయారు చేయబడిన రుచికరమైన ఔషధము

మేహకాకచే బిడ్డలు చిక్కి బలహీనులగుచున్నారు బిడ్డలు పెరుగక వేడిచే శల్యగతమైయుండు వారికి దీనినిచ్చిన దేహపుష్ఠి ఆరోగ్యము అందము కల్గును తల్లి దండ్రుల సంబంధమైన మేహకాక గర్భములోనే బిడ్డలకు సంక్రమించి పుట్టిన బిడ్డలకు అనేక విధమ్ములైన వ్యాధులను కల్గించును గుండె ఎండిపోవుట, గుండెదడ శరీతము రక్తము లేక తెల్లబారిపోవుట, గజ్జి, తీట, ఉడుకు, ఎండిపోవుట, బిడ్డలు దినదినానికి పెరుగక, చిక్కిపోవుట, దుర్బలం, కాళ్లు చేతుల మంటలు, అజీర్ణము, బుద్ధిమాంద్యం, మూత్రముమంట, (నిరుచురుకు గుండెనొప్పి) కాళ్లు చేతులు నిలువలేకుండట, పొడిదగ్గు, మలబద్ధకం, మొదలైన వ్యాధులను పొగొట్టి, బాగుగ ఆకలినిగలగించి, పరిశుద్ధమైన రక్తమును వృద్ధిచేసి, ఎండిపోయిన శరీరమును వృద్ధిచేసి,దేహమునకు బలము, పుష్టి, కాంతిని గలిగించును. ఇది చదువుకొను బాలురకు మిక్కిలి శ్రేష్ఠమైనది, మెదడుకు బలమును గల్గించి మంచి జ్ఞాపకశక్తినిచ్చును. టిన్ను 1-కి రూ 3-0-0

ధనలక్ష్మి అండుకో. సౌకార్‌పేట పోసు, మదరాసు.